108 ఈఎంటీకి ఉత్తమ ఉద్యోగి అవార్డు



మేడ్చల్: కీసర మండల పరిధిలో 108లో పనిచేసే ఈఎంటీకి ఉత్తమ ఉద్యోగి అవార్డు లభించింది. రాష్ట్రస్థాయిలో కీసర 108 ఈఎంటీ రవికి అవార్డు లభించగా సంస్థ డైరెక్టర్ వెంకటేషం గుండ్లపోచంపల్లిలోని 108 కార్యాలయంలో సోమవారం అందజేశారు.

ఎస్టీయూటీఎస్ నూతన కార్యవర్గం



మేడ్చల్: టీచర్ల యూనియన్ ఎస్టీయూటీఎస్ నూతన కార్యవర్గాన్ని మేడ్చల్‌లో ఆ సంఘం ఉపాధ్యాయులు సమావేశమై ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రాజారావు, ప్రధాన కార్యదర్శిగా నాగేశ్వర్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రేంకుమార్, జిల్లా నాయకులు గోపీనాథ్, మోహన్‌కుమార్, మండల నాయకులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

మేడ్చల్: మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ రజితరాజమల్లారెడ్డి తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 11గంటలకు నిర్వహించే సమావేశానికి సభ్యులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు. అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని కోరారు. సమావేశాలకు హాజరు కాని అధికారులపై చర్యలు ఉంటాయన్నారు.

కీసర మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కీసర: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహిస్తారని ఎంపీడీఓ గ్యామ తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ మల్లారపు ఇందిరాలక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించే మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి వివిధ గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, శాఖల అధికారులు, సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

బీఆర్ఎస్ 28వ డివిజన్ అధ్యక్షుడిగా మహేందర్‌యాదవ్



మహేందర్‌యాదవ్‌ను సత్కరిస్తున్న జవహర్‌నగర్ బీఆర్ఎస్ అధ్యక్షులు కొండల్‌ముదిరాజ్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ 28వ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడిగా కానుగంటి మహేందర్‌యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆదేశాల మేరకు సోమవారం జవహర్‌నగర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్ సమక్షంలో మహేందర్‌యాదవ్‌ను నియమించారు. అదేవిధంగా ప్రధాన కార్యదర్శిగా దివాకర్‌రాజ్, ఉపాధ్యక్షుడిగా నర్సయ్యను నియమించారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు సుధాకర్‌చారి, నర్సింహులు, శ్రీరాములు, నర్సింహయాదవ్, సతీష్‌యాదవ్, నాయకులు బండకింది ప్రసాద్‌గౌడ్, కేకే.చారి, శేఖర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సింక్రొనీకి బిఎఫ్ఎస్ గుర్తింపు..

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో కార్యకలాపాలు నిర్వహించే ఆర్థిక సేవల సంస్థ సింక్రొనీకి బెస్ట్ వర్క్ ప్లేస్ ఇన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్(బిఎఫ్ఎస్ఐ) గుర్తింపు లభించింది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. తమ సంస్థకు చెందిన మొత్తం ఉద్యోగుల్లో 51శాతం మంది మహిళలు, 106 మంది దివ్యాంగులు, పెద్ద వయసు వ్యక్తులు.. ఇలా విభిన్న వర్గాలకు భాగస్వామ్యం కల్పించామని, 100శాతం వర్క్ ఫ్రమ్ హోమ్ సౌకర్యం అందిస్తున్నామని వివరించారు.

వైభవంగా బొడ్రాయి వార్షికోత్సవం



మల్లాపూర్: నాచారం బొడ్రాయి వార్షికోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామ దేవతలను పూజిస్తే అన్ని శుభాలే కలుగుతాయన్నారు. కార్యక్రమంలో గ్రేటర్ బీఆర్ఎస్ నాయకులు సాయిజెన్‌శేఖర్, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, నాయకులు మేడల మల్లికార్జున్‌గౌడ్, మేకల ముత్యంరెడ్డి, కర్ణ, భూపాల్‌రెడ్డి, రమణారెడ్డి, పాండురంగన్‌గౌడ్, సాయిబాబా, ప్రేమ్‌కుమార్, ఎల్లేష్, హరిప్రసాద్, సాయి, యాదగిరి, రాజబాబు, నర్సింగ్‌రావు, పెంటయ్య, గంధం నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇది ఆలయ భూమి

అల్వాల్: మచ్చబొల్లారంలోని శ్రీరాధాకృష్ణ బాలాజీ ఆలయానికి చెందిన సర్వే నంబర్-91 భూమిలో హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ శేఖర్, పరిశీలకులు మధుబాబు సమక్షంలో బోర్డు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.వీరేశం, జేఏసీ నాయకులు సురేందర్‌రెడ్డి, స్థానిక భక్తులు బీవీ.రాంచందర్‌రావు, దేవాదాయ శాఖ చంద్రమోహన్, నరేందర్, ప్రవీణ్, రవీందర్‌రెడ్డి, అంజయ్య, కృష్ణ జోషి, కృష్ణతేజ, నర్సయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

1.5 కిలోల గంజాయి స్వాధీనం

ఘట్‌కేసర్: గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్న ఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. సీఐ సైదులు వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు కొండాపూర్ నల్ల చెరువు వద్ద గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఘట్‌కేసర్‌కు చెందిన దినేశ్(24), ఏపీ నెల్లూరుకు చెందిన రాఘవేందర్‌రెడ్డి(23), ఏపీ పిడుగురాళ్లకు చెందిన కొత్త మణిదీప్(24)ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 1.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.



ఉత్సాహంగా.. జనజాతర

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అంతాయిపల్లిలో కాంగ్రెస్ జనజాతర ఎన్నికల బహిరంగసభను సోమవారం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా జనం తరలివచ్చారు. ఎటుచూసినా సందడే కనిపించింది. మల్కాజిగిరి అభ్యర్థి సునీత మహేందర్‌రెడ్డి గెలుపు ఖాయమని, భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజాప్రతినిధులు కోరారు.



బీజేపీతోనే ప్రజలందరికీ మేలు



నాగారం మున్సిపల్ పరిధిలో ప్రచారంలో మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు



కీసరలో .. బీజేపీ నేతల ఎన్నికల ప్రచారం



ఘట్‌కేసర్‌లో ప్రచారం చేస్తున్న హనుమాన్, సుభాషిణి

నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఎన్నికల్లో ఈసారి ప్రజల మనిషి ఈటల రాజేందర్ గెలుపు ఖాయమని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలో బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ అభ్యర్థి ఈటల తరపున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ 9 ఏళ్ల కాలంలో అనేక పథకాలను అమలు చేశారన్నారు. దేశాన్ని ప్రపంచ దేశాల్లో అగ్రగామిగా నిలిపేందుకు నరేంద్ర మోదీ చేస్తున్న కృషి మరువలేదని, దేశంలోని ప్రజలందరికీ మేలు జరగాలంటే కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వం గెలిచి మోదీ ప్రధాని కావాల్సిన అవసరం ఉందన్నారు. కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ నాగారం అధ్యక్షుడు వేణుగోపాల్, గాలి సంపత్, బండారి శ్రీనివాస్‌రెడ్డి, నల్ల వెంకట్‌రెడ్డి, చంద్రమౌళి, కంటోళ్ల ఆంజనేయులు, మెట్టు కృష్ణాయాదవ్, సత్యనారాయణ, పెద్దులు, నక్క కిషోర్, రాకేష్, జంగారెడ్డి, అక్కాల సురేష్, సూర్యశేఖర్ రెడ్డి, రాముచారి, నాగరాజు, కుంటోళ్ల రవి, రవీందర్‌యాదవ్, కేశవరెడ్డి, వెంకటేశ్వరరావు, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం

ఘట్‌కేసర్: మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో ఆ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు విప్పర్ల హనుమాన్, మహిళా మోర్చా మున్సిపల్ అధ్యక్షురాలు సుభాషిణితో కలిసి సోమవారం ప్రచారం నిర్వహించారు. దేశంలో పారదర్శక, మెరుగైన పాలన అందించిన నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని మూడోసారి గద్దెనెక్కించడానికి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని వారు ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. కార్యక్రమంలో సంపత్‌రెడ్డి, ఉదయ్, నాగరాణి, మహిళా మోర్చా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపు ఖాయం



చీర్యాల నుంచి సీఎం సభకు వెళ్తున్న ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ



జవహర్‌నగర్ నుంచి జనజాతరకు వెళ్తున్న కాంగ్రెస్ నేతలు

కీసర: మేడ్చల్–మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి గెలుపు ఖాయమని కీసర మండల ఎంపీపీ మల్లారపు లక్ష్మీనారాయణ అన్నారు. అంతాయపల్లి సమీపంలో సీఎం రేవంత్‌రెడ్డి మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్ నామినేషన్ సందర్భంగా సోమవారం నిర్వహించిన బహిరంగ సభకు చీర్యాల గ్రామం నుంచి పెద్దఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేడ్చల్–మల్కాజ్‌గిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ల కృష్ణాయాదవ్, రామిడి విజయ్‌రెడ్డి, ముప్పు రామారావు, ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, సామల శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు పంగ హరిబాబు, మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గూడురు అశోక్‌గౌడ్, నేతలు సురేష్, మాదిరెడ్డి భూపాల్‌రెడ్డి, మహేందర్‌యాదవ్, కౌకుట్ల శ్రీనివాస్‌రెడ్డి, సోమేశ్, రవీందర్, ప్రదీప్, చక్రపాణిగౌడ్, సతీష్‌గౌడ్, సత్యనారాయణ, శివలింగాల శ్రీనివాస్, ప్రవీణ్, మంచాల కిరణ్‌జ్యోతి, యాదగిరిగౌడ్, అభిలాష్, వెంకటేష్, లక్ష్మణ్, టి.నారాయణ, నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల నుంచి తదితరులు తరలివెళ్లారు.

జనజాతరకు తరలిన కాంగ్రెస్ నేతలు

జవహర్‌నగర్: కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీతమహేందర్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమం అనంతరం శామీర్‌పేటలో జరిగిన జనజాతరకు జవహర్‌నగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ ఆధ్వర్యంలో వేలాదిగా తరలివెళ్లారు. కార్యక్రమంలో మేయర్ శాంతికోటేష్‌గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కారింగుల శంకర్‌గౌడ్, నాయకులు సదానంద్, కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ఎక్సలెన్షియా సత్తా ఖాయం



ఉప్పర్‌పల్లిలో మాట్లాడుతున్న ఎక్సలెన్షియా డైరెక్టర్ వెంకట్

శామీర్‌పేట్: జేఈఈ మెయిన్స్‌లో తూంకుంట మున్సిపాలిటీ ఉప్పర్‌పల్లిలోని ఎక్సలెన్షియా కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా కళాశాలలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ కళాశాల డైరెక్టర్ వెంకట్ ముర్కి మాట్లాడుతూ సోమవారం విడుదల చేసిన కీ ప్రకారం జేఈఈ మెయిన్స్‌లో ఎక్సలెన్షియా విద్యార్థి 300 మార్కులకు 270 మార్కులు, కెమిస్ట్రీలో 100 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. కళాశాల, అధ్యాపకులు ప్రత్యేక విధానాలతోనే సాధ్యమైందని, 50 శాతం విద్యార్థులు 200లకు పైగా మార్కులు సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఈశ్వరన్, జంషెడ్, సుధీర్, హెడ్ జాన్, రమేశ్, వెంకటేశ్వర్లు, ఎక్‌నాథ్, రహీం, అనీల్ పాల్గొన్నారు.

పశువులను తరలిస్తున్న వాహనం స్వాధీనం

పోచారం: పశువులను క్రూరంగా తరలిస్తున్న వాహనాన్ని పోచారం పోలీసులు పట్టుకున్నారు. సీఐ రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం అన్నోజిగూడలో వాహనాలను తనిఖీ చేస్తుండగా 46 ఎద్దులను, 8 దూడలను తరలిస్తున్న డీసీఎంను పోలీసులు ఆపారు. వెంటనే వాహనాన్ని స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేశారు. అనంతరం పశువులను జంతు సంరక్షణశాలకు తరలించారు. మాంసం కోసం ఒరిశా నుంచి హైదరాబాద్‌లోని బహదూర్‌పురాకు ఎద్దులు, దూడలను తరలిస్తున్నట్లు నిందితులు చెప్పారు. హయత్‌నగర్‌కు చెందిన డీసీఎం డ్రైవర్ మద్దూరి శ్రీశైలం(29)తో పాటు కిషోర్ కుమార్ యాదవ్(29), పొదులం నాయక్(34)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఒకరు పరారీలో ఉన్నాడు.

ఉల్లిగడ్డల సంచుల చాటున పత్తి విత్తనాలు

రూ.30 లక్షల విలువ గల విత్తనాలు సీజ్

శామీర్‌పేట్: ఉల్లిగడ్డల సంచుల చాటున అనుమతి లేని పత్తి విత్తనాలను తరలిస్తున్న ముఠాను ఎస్‌వోటీ పోలీసులు ఆదివారం రాత్రి శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో అరెస్ట్ చేశారు. వివరాలు.. కర్నాటక నుంచి శామీర్‌పేట మీదుగా కరీంనగర్, మందమర్రికి ఓ లారీలో అనుమతి లేని విత్తనాలను తరలిస్తున్నారు. ఈ క్రమంలో కరీంనగర్ – హైదరాబాద్ రాజీవ్ రహదారిలో గల శామీర్‌పేట దర్గా వద్ద వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా రూ.30 లక్షల విలువ గల 1200 కిలోల అనుమతి లేని పత్తి విత్తనాలను గుర్తించారు. ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

13 తులాల బంగారు నగలు మాయం

ఉప్పల్: ఇంటికి తాళం వేసింది.. వేసినట్లే ఉంది. లాకర్ కూడా తెరవలేదు.. కానీ అందులోని బంగారు నగలు మాయం అయ్యాయని ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ ఆదర్శ్‌నగర్ ప్రాంతానికి చెందిన రవిందర్ కుమార్ ఫార్మాలో పని చేస్తుంటాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి బీరువాలోని 13 తులాల బంగారు నగలు మాత్రమే చోరీ చేశారని, మిగిలిన 10 తులాల నగలు అలాగే ఉన్నాయని ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని క్లూస్ టీంను రంగంలోకి దింపి దర్యాప్తు ప్రారంభించారు.

కీసరగుట్టలో రాగిడి లక్ష్మారెడ్డి పూజలు



కీసరగుట్ట స్వామి సేవలో మల్కాజ్‌గిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి



ఘట్‌కేసర్‌లో ప్రచారం చేస్తున్న మాధవరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్

కీసర: మేడ్చల్–మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి సోమవారం కీసరగుట్ట భవానీరామలింగేశ్వర స్వామి సేవలో పాల్గొన్నారు. ఉదయం దేవాలయానికి విచ్చేసిన రాగిడి లక్ష్మారెడ్డికి వేదపండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామికి ప్రత్యేక పూజల అనంతరం ఆలయ వేద పండితులు రాగిడి లక్ష్మారెడ్డికి స్వామివారి ఆశీర్వచనాలు అందజేయగా, ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీసరగుట్ట రామలింగేశ్వరుడి ఆశీస్సులతో ఇక్కడి ప్రజలకు సేవ చేసేందుకు ఎంపీగా గెలిపించాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు తటాకం భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని 14, 17 వార్డులో బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో మల్కాజ్‌గిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి లక్ష్మారెడ్డిని గెలిపించాలని సోమవారం ప్రచారం చేశారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి హాజరై బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలను ఇంటింటికీ తిరిగి వివరించారు. కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నర్సింగ్‌రావు, ఖలీల్, ఫిరోజ్, షకీల్, శ్రీనివాస్, నగేశ్, లక్ష్మయ్య, లత, కమలమ్మ, చంద్రయ్య, రాజేశ్, వెంకటేశ్‌చారి పాల్గొన్నారు.

సెల్‌టవర్ పనులను నిలిపివేయండి

నాగారం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం



నాగారం మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్‌కు వినతిపత్రం అందజేస్తూ..

కీసర: నాగారం మున్సిపల్ పరిధిలోని ఈస్ట్ గాంధీనగర్‌లోని రోడ్డు నంబర్–2లోని సిద్ది రెసిడెన్సీ ఎదురుగా బిల్డింగ్‌పై నిర్మిస్తున్న సెల్ టవర్ పనులను వెంటనే నిలిపి వేయాలని కోరుతూ సోమవారం ఈస్ట్ గాంధీనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇళ్ల మధ్యలో సెల్‌టవర్ ఏర్పాటు చేస్తే సెల్‌టవర్ నుంచి వెలువడే రేడియేషన్ వల్ల ప్రజలకు ఇబ్బందులతో పాటు రోగాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. కోఆప్షన్ సభ్యుడు షేక్ శఫిక్, మాజీ వార్డు సభ్యుడు సత్యంసాగర్, కాలనీ అసోషియేషన్ అధ్యక్షుడు ఎస్.కృష్ణారెడ్డి, జనరల్ సెక్రటరీ వంకోజు శ్రవణ్ కుమార్, సభ్యులు వెంకటరమణ, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం కుండలు పగులగొట్టిన దుండగులు

ఘట్‌కేసర్: అవుషాపూర్‌లో వైఎస్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలోని కుండలను గుర్తు తెలియని దుండగులు ఆదివారం రాత్రి పగులగొట్టారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్, ట్రస్ట్ సభ్యురాలు కావేరిమశ్చేందర్‌రెడ్డి మాట్లాడుతూ వేసవిలో పాదచారులు, ప్రయాణికుల దాహం తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేస్తే కుండలు పగులగొట్టడం సమంజసం కాదన్నారు.



అవుషాపూర్‌లో దుండగులు పగుల గొట్టిన కుండలు

రోడ్లపై చెత్త వేయొద్దు



ఉప్పల్ నాలా వద్ద స్థానికులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీసీ ఆంజనేయులు, డీఈ చందన

ఉప్పల్: సర్కిల్‌లో చెత్త కుప్పలు లేకుండా చేయడమే లక్ష్యంగా అధికారులు పని చేయాలని ఉప్పల్ సర్కిల్ డీసీ ఆంజనేయులు సూచించారు. ఈ మేరకు సోమవారం ఉప్పల్ కావేరినగర్ నాలా వద్ద స్థానికులు, జీహెచ్ఎంసీ కార్మికులతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. నాలా వద్ద నిత్యం చెత్త పడేస్తున్నారని, దీంతో రోడ్డు మొత్తం వ్యాపించి దుర్గంధం వెదజల్లుతోందని, చెత్త లేకుండా చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా చెత్త డంపింగ్ పాయింట్స్ వద్ద కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరూ రోడ్లపై చెత్త వేయవద్దని, కెమెరాలో రికార్డులను పరిశీలించి జరిమానా వేస్తామని ఆయన తెలిపారు. శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్, వెంకటరెడ్డి, చందన తదితరులు పాల్గొన్నారు.

ఓటు.. మన భవిత



బోడుప్పల్: సమాజంలో ప్రతి ఒక్కరూ ఓటు విలువ తెలుసుకుని దాన్ని వినియోగించుకోవాలని లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్ లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ 10వ తరగతి విద్యార్థులు సోమవారం రాబోయే ఎన్నికలను ఉద్దేశించి మన ఓటు – మన హక్కు అనే అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇంటింటికీ, షాపులకు తిరుగుతూ ఓటు గొప్పదనం గురించి తెలపాలన్నారు. ఓటు సామాన్యుడి ఆయుధమని, మంచి నాయకుడే భావితరానికి మార్గదర్శకుడన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటును వినియోగించుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి వారి తల్లిదండ్రులు, వారి బంధువులచే ఓటును వినియోగించుకునే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.